క్లుప్తంగా

మద్యం మత్తులో యువకుడి మృతి



మృతుడు మహారాణా (ఫైల్)

గోపాలపట్నం: మద్యం మత్తులో యువకుడు నాలుగంతస్తులపై నుంచి పడి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్ పార్క్ సామీపంలో టీఎంఆర్ అపార్ట్‌మెంట్‌లో ఒడిశాకు చెందిన ఐదుగురు కొద్దిరోజులుగా కబ్బోర్డు పనులు చేస్తున్నారు. గంజాం జిల్లా గల్లెరి గ్రామానికి చెందిన బసంత్ మహారాణా (32) ఆదివారం రాత్రి మద్యం సేవించాడు. సోమవారం ఉదయం చూసేసరికి మహారాణా కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. కిటికిలో నుంచి దూకడంతో పక్కనే ఉన్న ఇంటి ప్రాంగణంలో పడిపోయినట్టు గుర్తించారు. పోలీసులకు సమాచారమివ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతునికి వివాహం కాలేదు. తల్లిదండ్రులు, సోదరుడు ఉన్నారు. సూపర్‌వైజర్ సూర్యనారాయణ, సహచర పనివారు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గోపాలపట్నం: ఆర్ఆర్‌వీ పురం సబ్ స్టేషన్ పరిధి, బుచ్చిరాజుపాలెం సబ్ స్టేషన్ పరిధి, శ్రీరామ్‌నగర్ ఫీడర్, పోలీస్ స్టేషన్ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల్లో భాగంగా గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఈఈ పోలాకి శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బాపూజీనగర్, టైలర్స్ కాలనీ, శ్రీరామ్‌నగర్, ప్రశాంతినగర్, గోపాలపట్నం బంక్ ప్రాంతం, గోపాలపట్నం ప్రధాన రోడ్డు, బాజి జంక్షన్, సుసర్ల కాలనీ, బుచ్చిరాజుపాలెం రెడ్డి వీధి, విద్యానగర్, నేతాజి వీధి, రైల్వే స్టేషన్ ప్రధాన రోడ్డు, తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఏఎన్ఎంల ధర్నా



డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఎన్ఎంలు

మహారాణిపేట : వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ఏఎన్ఎంలు ఆందోళనకు దిగారు. సమస్యలు పరిష్కారించాలని కోరుతూ ఏఎన్ఎంలు నినాదాలు చేశారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న నాయకులతో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు చర్చలు జరిపారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, ఆందోళన విరమించాలని యూనియన్ నాయకులను డీఎంహెచ్‌వో కోరారు. అయినా ఏఎన్ఎంలు ఆందోళన కొనసాగించారు. బీసీజీ వ్యాక్సినేషన్‌ను రెండు రోజుల నుంచి తగ్గించాలని, యూనిఫారాల అలవెన్స్ ఇవ్వాలని, సెలవుల్లో కోత విధించరాదని, సచివాలయ ఏఎన్ఎంలపై పని ఒత్తిడి తగ్గించంచాలని, సెలవుల్లో కూడా విధులు నిర్వహించవలసి వస్తుందని నాయకురాలు మణి తెలిపారు. అధికారుల ఒత్తిడి అధికంగా ఉందంటూ ఆందోళన కొనసాగించారు.

మందుబాబులకు రూ.71,500 జరిమానా

పీఎం పాలెం : మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారికి న్యాయస్థానం రూ.71,500 లు జరిమానా విధించింది. ఇందుకు సంబంధించి పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ వెంకటరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కారుషెడ్ కూడలి, కొమ్మాది, మారికవస జాతీయ రహదారి కూడళ్లలో ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడుపుతున్న 42 మంది పోలీసులకు చిక్కడంతో వారిపై కేసులు నమోదు చేశారు. వారిని మంగళవారం న్యాయమూర్తి ముందు హాజరు పరచగా ఒక్కొక్కరికీ రూ.1500 నుంచి రూ. 3 వేల వరకూ మొత్తం 71,500 జరమానా విధించారని ఎస్ఐ తెలిపారు.

ఘనంగా మోదకొండమ్మ అమ్మవారి పండగ



పూజలందుకుంటున్న మోదకొండమ్మ అమ్మవారు



పరసలో సుబ్రహ్మణ్య స్వామి నృత్య రూపకం



డ్యాన్స్ చేస్తున్న కళాకారులు

గోపాలపట్నం: గోపాలపట్నం ఇందిరానగర్‌లోని మోదకొండమ్మ అమ్మవారి పండగ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు బారులుదీరారు. పసుపు, కుంకుమలతో అభిషేకాలు,అర్చనలు చేశారు. అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. భక్తులకు సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.తాగునీరు, మజ్జిగ ఉచితంగా పంపిణీ చేశారు. సాయంత్రం అమ్మవారి ఆలయం వద్ద పూజలు చేసి ఘటాల ఊరేగించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఇందిరానగర్ పలు వీధుల్లో ఏర్పాటు చేసిన స్టేజిల్లో డ్యాన్స్‌లు కుర్రకారును ఉర్రూతలూగించాయి. రహదారిపైనే చాలా మంది డ్యాన్సులను చూస్తూ ఉండిపోయారు. పరసలో వివిధరకాల వస్తువులు కొనుగోలు చేస్తూ స్థానికులు సందడి చేశారు.

గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు 100 రోజుల ప్రణాళిక

- డీసీపీ మోకా సత్తిబాబు
- గంజాయి ప్రభావిత ప్రాంతాలపై నిఘా
- కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు



వెస్ట్ ఏసీపీ కార్యాలయంలో వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ మోకా సత్తిబాబు

గోపాలపట్నం: గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు 100 రోజుల ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని డీసీపీ మోకా సత్తిబాబు చెప్పారు. విశాఖను డ్రగ్స్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మంగళవారం సాయంత్రం వెస్ట్ సబ్ డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు.

రాష్ట్ర హోం మంత్రి అనిత, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, విశాఖ పోలీస్ కమిషనర్ రవిశంకర్ ఆదేశాల మేరకు విశాఖ జోన్–2 పరిధిలో గంజాయి, డ్రగ్స్‌ను సమూలంగా నిర్మూలిస్తామని తెలిపారు. ఇందుకు కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లనున్నట్టు వెల్లడించారు. డ్రగ్స్, గంజాయి ప్రభావిత ప్రాంతాలు.. లభ్యమవుతున్న ప్రాంతాలను గుర్తించామని వాటిపై ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు. మాదకద్రవ్యాలు వినియోగించే విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. కళాశాలల్లో వైద్యులు, మానసిక వైద్యులు, పోలీసులు, రాజకీయ నాయకులు, కళాశాల అధ్యాపకులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో తల్లిదండ్రులను భాగస్వామ్యులను చేస్తామని చెప్పారు. కళాశాలల్లో, పాఠశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కమిటీలో పోలీసులు, విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు ఉంటారన్నారు. జోన్–2 పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి, డ్రగ్స్‌ను 100 రోజుల్లో నిరోధిస్తామని తెలిపారు. గంజాయి ట్రాన్స్ పోర్టును నిరోధించేందుకు సరిపల్లి వద్ద చెక్ పోస్టు ఏర్పాటు చేశామని, ఇది 24 గంటలు పని చేసే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. జోన్ పరిధిలో మాదకద్రవ్యాల వినియోగం, రవాణాకు చెందిన 339 కేసులు అండర్ ట్రైల్స్‌లో ఉన్నాయని తెలిపారు. సమావేశంలో ఏసీపీలు అన్నెపు నరసింహామూర్తి, బి.మోసెస్ పాల్, జోన్–2 పరిధిలో సీఐలు పాల్గొన్నారు.

89, 92వ వార్డుల్లో ఎమ్మెల్యే పర్యటన



పద్మనాభనగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం : జీవీఎంసీ 89, 92వ వార్డుల్లో ఎమ్మెల్యే గణబాబు మంగళవారం పర్యటించారు. 92వ వార్డు పద్మనాభనగర్‌లో, 89వ వార్డు కొత్తపాలెం ప్రాంతాల్లో జోన్ – 8, రెవెన్యూ అధికారులతో కలిసి పలు సమస్యలపై సమీక్షించారు. పద్మనాభనగర్‌లో టిడ్కో ఇళ్లు పూర్తి చేసేందుకున్న ఇబ్బందులపై ఆరా తీశారు. వీటిని త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందివ్వాలని ఆదేశించారు. 89వ వార్డులో కాల్వలు, గెడ్డలు తదితర సమస్యలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలు వెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకట రమేష్, స్థానిక నాయకులు బాల సుబ్రహ్మణ్యం, బొడ్డేటి విజయ్, తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి పూజలు

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం ఊర్వశి జంక్షన్ కూడలి రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్యస్వామి ఏకాంత ఆలయంలో జ్యేష్ఠ మాస శుద్ధద్వాదశి మంగళవారాన్ని పురస్కరించుకుని శరవణ ట్రస్ట్ చైర్మన్, ఆలయ ధర్మకర్త దేవాల రాజు ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యస్వామికి ఆలయ అర్చకులు రామకృష్ణ శర్మ స్కంద పూజలు నిర్వహించారు. అష్టోత్తర శత కలశాభిషేకం, సహస్రనామం, విభూది, పుష్పలతో అర్చనలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

ఉక్కు కార్మికులకు తక్షణమే వేతనాలు చెల్లించాలి

- అఖిలపక్ష నాయకుల డిమాండ్
- ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ కూడలి వద్ద ధర్నా



ధర్నాలో ప్రసంగిస్తున్న స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు తక్షణం వేతనాలు చెల్లించాలని ఉక్కు అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ కూడలి వద్ద ధర్నా చేశారు. వేతనాల జాప్యాన్ని నిరసిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యం ఉత్పత్తి, సేల్స్ జరుగుతున్నా కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదన్నారు. కొన్ని నెలలుగా జీతాల కోసం ఆందోళన చేసేలా యాజమాన్యం ప్రవర్తిస్తోందన్నారు. 18వ తేదీ వచ్చినా జీతాలు చెల్లించకపోతే కార్మికులు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. జీతాలు ఆఖరి ప్రాధాన్యతగా భావించే యాజమాన్యం వైఖరి దుర్మార్గమన్నారు. దీనిపై యాజమాన్యాన్ని నిలదీయాల్సి ఉందన్నారు.

ముందుగా సగం వేతనాలు

ఉక్కు యాజమాన్యంతో అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశంలో మంగళవారం సాయంత్రం సగం వేతనాలు ఇస్తామని సీఎండీ హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. మిగిలిన సగం బుధవారం సాయంత్రం వేస్తామన్నారని తెలియజేశారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, మంత్రి రాజశేఖర్, నీరుకొండ రామచంద్రరావు, జె. అయోధ్యరామ్, ఎస్.రామారావు, యు. రామస్వామి, జి. గణపతి రెడ్డి, రామ్మోహన్‌కుమార్, మహాలక్ష్మినాయుడు, బి. డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్లకు ఎన్నికల డ్యూటీ పారితోషికం చెల్లించాలి

డాబాగార్డెన్స్: ఆశ వర్కర్ల ఎన్నికల డ్యూటీ పారితోషికం అందజేయాలని యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు పి.మణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్, డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు జిల్లాలో గల ఆశ వర్కర్లు మే 13న పూర్తి రోజు ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు నిర్వహించారన్నారు. ఈ క్యాంపులు నిర్వహించినందుకు ఆశ వర్కర్లకు రెమ్యూనరేషన్ చెల్లించాలని పలుమార్లు విజ్ఞప్తి చేసిన ఫలితంగా ఆశ వర్కర్లకు రూ.200 రెమ్యునరేషన్ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారన్నారు. గాజువాక, విశాఖ పశ్చిమ నియోజకవర్గాల్లో చెల్లించారని, మిగిలిన 5 నియోజకవర్గాల్లో ఇంత వరకు చెల్లించలేదన్నారు. ఎన్నిక పూర్తయి నెల దాటినప్పటికీ ఇంకా చెల్లింపులు జరపకపోవడం బాధాకరమని, కలెక్టర్ స్పందించి తక్షణం చెల్లింపులు జరిగేటట్టు చూడాలని విజ్ఞప్తి చేశారు.

ఉక్కు అధికారి మరణంపై ఫిర్యాదు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ అధికారి, తన భర్త నాట్ర తాతారావు మరణంపై వాస్తవాలు వెలుగులోకి తేవాలని మృతుని భార్య బంగారమ్మ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, హోం మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి టి.జి.భరత్, చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్‌లకు ఫిర్యాదు చేశారు. తన భర్త మృతి విషయంలో యాజమాన్యం ద్వంద్వవైఖరి అవలంబిస్తుండడంతో తమ కుటుంబానికి తీరని నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. 2017లో ఏప్రిల్ 11న డ్యూటీకి వెళ్లిన తన భర్త తిరిగి రాలేదని పేర్కొన్నారు. తరువాత ప్లాంట్ ఆవరణలో మృతి చెంది ఉండడంతో యాజమాన్యం కూడా ప్రమాదవశాత్తు మరణించారని అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేసిందని పేర్కొన్నారు. తరువాత ఏమైందో, యాజమాన్యం మాట మార్చి కర్మాగారం ఆవరణలో మృతి చెందలేదని బుకాయిస్తూ తమ కుటుంబానికి తీరని అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై గతంలో కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తే రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు వాటిపై చర్యల నిమిత్తం పంపించారని, అప్పట్లో ప్రభుత్వ అధికారులు కూడా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం హయాంలోనైనా తన కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉభయ దాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ఆర్ఎంపీలకు అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ కేకే శిరీష్

తాటిచెట్లపాలెం: గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలందిస్తున్న ఆర్ఎంపీలకు మంగళవారం రైల్వేన్యూకాలనీలోని అక్షయ హాస్పటల్‌లో అవగాహన నిర్వహించారు. ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో అక్షయ హాస్పటల్ ఎండీ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ తమ హాస్పటల్‌లో అన్ని సదుపాయాలు ఉన్నాయని, నాణ్యమైన వైద్య పేదలకు అందించడమే తమ ధ్యేయమని, వారి పరిధిలో ఉన్న పేదలకు వైద్య సేవల కోసం తమ ఆస్పత్రిని వినియోగించుకోవాలని కోరారు. సదస్సులో పాల్గొన్న గైనకాలజిస్ట్ డాక్టర్ కేకే శిరీష, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ భావన, ఆర్థోపెడీషియన్ డాక్టర్ వర్మలు వివిధ అంశాల్లో అవగాహన కల్పించారు. సంఘం అధ్యక్షుడు జంగం జోషి, జోనల్ గౌరవాధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు, సలహాదారు కోన ప్రకాష్, ప్రధాన కార్యదర్శి సుగుణేశ్వరి, విజయనగరం జిల్లా అధ్యక్షుడు చిరంజీవి కనకారావు, పడాల కోటి, లోగిశ గణేష్‌లతో పాటు గాజువాక, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆర్ఎంపీ పాల్గొన్నారు.

విద్య ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఆర్జేడీ విజయ భాస్కర్, డీఈవో చంద్రకళ తదితరులు

గాజువాక: విద్య ఆవశ్యకతను తెలియజేస్తూ గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా ఏపీ సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని రీజనల్ జాయింట్ డైరెక్టర్ విజయ భాస్కర్, జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ ప్రారంభించారు. డీఈవో చంద్రకళ మాట్లాడుతూ వచ్చేనెల 12వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు సునీత, విశ్వనాథం, పాఠశాల ప్రధానోపాధ్యాయిని విజయ ప్రశాంతి, సమగ్ర శిక్ష అభియాన్ అధికారి బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



పనులు పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

విశాఖ విద్య: అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. మంగళవారం జీవీఎంసీ అధికారులతో కలసి వార్డు పరిధిలోని రజక వీధి, మద్రిపాలెం వుడా లే అవుట్ ప్రాంతాల్లో పర్యటించారు. ఆయా కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావసరాల మేరకు చేపడుతున్న పనులు సకాలంలో పూర్తి చేసేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. రజకవీధిలో నిర్మిస్తున్న కళావేదిక కార్యక్రమాల నిర్వహణకు అణువుగా తీర్చిదిద్దాలన్నారు. చేపడుతున్న పనులను ఎప్పటికప్పుడు ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షించాలన్నారు. పర్యటనలో జీవీఎంసీ అసిస్టెంట్ ఇంజనీర్ ఉష, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, శానిటరీ అధికారి మూర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పైడిమాంబ.. పాహిమాం



అమ్మవారి ప్రతిమలతో భక్తులు



ప్రత్యేక అలంకరణలో పైడిమాంబ అమ్మవారు

కంచరపాలెం: ఐటీఐ జంక్షన్ పరిధి సంకురపేట ప్రజల ఆరాధ్య దైవం పైడిమాంబ అమ్మవారి ప్రధాన జాతర మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలిపూజను గ్రామాధ్యక్షుడు పిల్లి మురళీ, గ్రామ కమిటీ సభ్యులు నిర్వహించారు. అలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్ కుంకుమ పూజలు చేశారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులుదీరారు. ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, పి.గణబాబు, కార్పొరేటర్ ముర్రు వాణి నానాజీ తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గౌరీనగర్, గవర కంచరపాలెం, రెడ్డికంచరపాలెం, ఊర్వశికూడలి, దయానందనగర్, గోకుల్‌నగర్, ఐటీఐ కూడలి, తాటిచెట్లపాలెం, కరాసా, ఎన్ఏడీ, గోపాలపట్నం ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. పలువురు నాయకులు, సేవా సంఘాల ఆధ్వర్యంలో ప్రసాదాలు మజ్జిగలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో సెట్టింగ్‌లు, విద్యుత్ అలంకరణ కనువిందు చేశాయి. మూలవిరాట్ నుంచి తిరువీధి మహోత్సవం నిర్వహించారు. ఘటాలను ఆలయం వద్దకు చేర్చారు. కోలాటాలు, తప్పెడుగుళ్ల, చిడతలు, వివిధ నేలవేషాలు నడుమ అమ్మవారిని ఊరేగించారు. అనంతరం ఆలయం వద్దకు తీసుకొచ్చి ఘనంగా అనుపోత్సవం నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించింది. ఐదో పట్టణ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఉత్సవ వేడుకలను గ్రామ కమిటీ పాలక వర్గ సభ్యులు రమణ, శంకర్, రాము, సూరిబాబు, సముద్రాలు తంగేటీ శ్రీను, కుమార్ అప్పలరాజు తదితరులు పర్యవేక్షించారు.

కేజీహెచ్‌లో డెంగ్యూ కలకలం

యుద్ధప్రాతిపదికన నివారణ చర్యలు చేపట్టిన అధికారులు



సింటెక్స్ వాటర్ ట్యాంక్‌లో ఎప్పటి నుంచో ఉన్న నీటిని పరిశీలిస్తున్న మలేరియా అధికారి



నర్సింగ్ స్కూల్లో డెంగ్యూ నివారణకు మినీ ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది



నర్సింగ్ కళాశాల, స్కూల్ చుట్టూ యాంటీ లార్వా మందు పిచికారీ చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

డాబాగార్డెన్స్: ఎంతో మందికి ఆరోగ్య సేవలందిస్తున్న కేజీహెచ్‌లో డెంగ్యూ కలకలం రేపుతోంది. అపరిశుభ్ర వాతావరణంతో కేజీహెచ్ కొట్టుమిట్టాడుతోంది. ముఖ్యంగా కేజీహెచ్‌కు అనుసంధానంగా ఉన్న నర్సింగ్ కళాశాల, నర్సింగ్ స్కూల్లో అపారిశుధ్యం తాండవిస్తోంది. డ్రైనేజీలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. డెంగ్యూ జ్వరంతో కేజీహెచ్‌లో చికిత్స పొందే ఎందరో రోగులకు వైద్య సేవలందిస్తున్న నర్సింగ్ విద్యార్థినికి డెంగ్యూ సోకింది. కింగ్ జార్జి ఆస్పత్రికి అనుసంధానంగా ఉన్న నర్సింగ్ స్కూల్ విద్యార్థికి డెంగ్యూ సోకింది. సమాచారం అందిన జీవీఎంసీ బయాలజిస్ట్ సాంబశివరావు, జోన్–4 మలేరియా ఇన్‌స్పెక్టర్ రాంబాబు, సిబ్బంది, అప్రమత్తమయ్యారు. వ్యాధి మకరొకరికి సోకకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. అపరిశుభ్రంగా ఉన్న డ్రైనేజీలు, మూతలు లేని సింటెక్స్ మంచినీటి ట్యాంకులు శుభ్రం చేయించారు. కేజీహెచ్‌లో యాంటీ లార్వా ఆపరేషన్, ఇండోర్ స్ప్రింగ్, మినీ ఫాగింగ్ చేపట్టారు.

అసభ్య ప్రసంగాలను ప్రతిఘటించండి



గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న ఆచార్య వి.బాలమోహన్‌దాస్

సీతంపేట: అసభ్య ప్రసంగాలను ప్రతిఘటించండి అంటూ ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ సంస్థ పిలుపు నిచ్చింది. ఈమేరకు బుల్లయ్య కళాశాల గాంధీ సెంటర్‌లో సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతిని జాగృతం చేసే బదులు జాతి ఐక్యతకు భంగం కలిగేలా ప్రసంగాలు ఉంటున్నాయని అది ఎంతమాత్రం క్షేమకరం కాదన్నారు. ఐక్యరాజ్యసమితి ఏటా జూన్18న అంతర్జాతీయ అసభ్య ప్రసంగాల ప్రతి ఘటనా దినంగా ప్రకటించిందని గుర్తుచేశారు. పీస్ అండ్ హార్మోనీ సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ప్రజలను జాగృతం చెయ్యాలనే సంకల్పంతో ఈ నెల 23న ఉదయం 10 గంటలకు బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విద్యావేత్తలు, మతపెద్దలు పాల్గొని తమ అభిప్రాయాలు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజ్ఞాన్‌కుమార్, అబ్దుల్ మునీర్, సత్యమూర్తి పాల్గొన్నారు.